ఖాళీ అవుతున్న స్వర్ణముఖి

పెళ్లకూరు: స్వర్ణముఖి నదిలో సమృద్ధిగా ఉన్న ఇసుక



ఇసుక తవ్వకాలతో నిరుపయోగమైన వ్యవసాయ బోర్లు



అధికారం అండతో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. వాగులు, వంకలు, చెరువుల్లోని గ్రావెల్, మట్టి, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. వారి కన్ను స్వర్ణముఖి నదిపై పడింది. ఇక్కడి ఇసుకకు చెన్నైలో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీన్ని చెన్నైకి తరలించి రూ.కోట్లు ఆర్జించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రహస్య ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే చెన్నై వ్యాపారులతో బేరం కుదుర్చుకున్నట్టు సమాచారం. అంతేగాక కొందరు ఉచిత ఇసుక రవాణా మాటున అక్రమ రవాణాను జోరుగా సాగిస్తున్నారు. స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకంతో భూగర్భ జలాలు తగ్గిపోతాయని రైతులు వాపోతున్నారు.

- స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- చెన్నై వ్యాపారులతో కూటమి నేతల బేరం?
- లారీ ఇసుక రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షలు
- ఉచితం మాటున అక్రమ వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



నాయుడుపేట టౌన్: మూర్తిరెడ్డిపాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

పెళ్లకూరు/నాయుడుపేట టౌన్ : పెళ్లకూరు మండలంలోని కలవకూరు, యడపూడి, కప్పగుంటకండ్రిగ, పుల్లూరు తదితర గ్రామాలు, నాయుడుపేట మండలంలోని అయ్యప్పరెడ్డి పాళెం, మూర్తిరెడ్డి పాళెం, కల్లిపేడు, తుమ్మూరు, మర్లపల్లి అన్నమేడు, భీమవరం తదితర ప్రాంతాల్లో స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఇందులో మంచి నాణ్యమైన ఇసుక ఉంది. దీనికి చెన్నైలో మంచి డిమాండ్ ఉంది. లారీ ఇసుక ధర రూ.1.20 లక్షల నుంచి రూ1.50 లక్షలు పలుకుతోంది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు టీడీపీ సీనియర్ నాయకులు ఇసుకను రాత్రికి రాత్రి తరలించి సొమ్ము చేసుకోవాలని పది రోజులుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. స్వర్ణముఖినదిలోకి వాహనాలు వెళ్లేలా రోడ్లను సిద్ధం చేస్తున్నారు. నాయుడుపేట మండలంలో మూర్తిరెడ్డిపాళెం, అయ్యప్పరెడ్డిపాళెం, మర్లపల్లి తదితర చోట్ల స్వర్ణముఖి నది పొర్లు కట్టలను తెగ్గొట్టి రోడ్డును వేసుకున్నారు. టీడీపీ నాయకులు ట్రాక్టర్లకు పైలెట్లుగా వస్తూ మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు ఇసుకను తరలిస్తున్నారు. కొందరు అటవీ ప్రాంతాల్లో డంపింగ్ చేసి రాత్రిళ్లు లారీల్లో చెన్నైకి పంపిస్తున్నారు.

పక్కా ప్రణాళికలతో ముందుకు..

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే నదీ పరివాహక గ్రామాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పక్కా ప్రణాళికతో ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలపై దృష్టిసారించారు. ఇబ్బడిముబ్బడిగా కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి పట్టణాలకు మట్టి, ఇసుక, గ్రావెల్ ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.5,500 నుంచి రూ.6 వేల వరకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. చెన్నైలో లారీ ఇసుక రూ.1.20 లక్షలు నుంచి రూ.1.50 లక్షల వరకు ధర పలుకుతుండడాన్ని గమనించారు. మండల స్థాయి అధికారులతో మంతనాలు చేసుకుని ట్రాక్టర్‌కు ఒక రేటు, లారీకి మరోరేటు, నెలకు ఇంకో రేటు చొప్పున బేరం కుదుర్చుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెన్నై వ్యాపారుల నుంచి ముందగానే భారీగా అడ్వాన్స్‌లు తీసుకుని రాత్రికి రాత్రి ఇసుకను తరలించడానికి మార్గాలను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

మామూళ్లు చెల్లిస్తే అందరూ చుట్టాలే..

ఇసుక తరలించే ట్రాక్టర్ల యజమానులు నెల మామూళ్లు చెల్లిస్తే చుట్టాల కింద అధికారులు ట్రీట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు కార్యాలయాల్లో కూర్చొని నేరుగా అధికారులతో భేరాలు కుదుర్చుకుంటున్నారు. పెళ్లకూరులో రూ.25 వేలు, బాలాయపల్లిలో రూ.10 వేలు, వెంకటగిరిలో రూ.15 వేలు, శ్రీకాళహస్తిలో రూ.10 వేలు చొప్పున ఒక్కో ప్రాంతానికి ఒక్కో రేటు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒక్కోసారి ఉన్నతాధికారుల ఆదేశాలతో దాడులు చేస్తున్న అధికారులు మామూళ్లు చెల్లించని ట్రాక్టర్లను మాత్రమే పట్టుకుంటున్నారనే విమర్శలున్నాయి.



నాయుడుపేట టౌన్: స్వర్ణముఖి నది పొర్లుకట్ట ధ్వంసం చేసి ఏర్పాటుచేసిన రోడ్డు



నాయుడుపేట టౌన్ : మేనకూరు సెజ్‌లోని పరిశ్రమ వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్లు

అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

నాయుడుపేట మండలం మర్లపల్లిలో రాత్రిళ్లు వీధి లైట్లు ఆపేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి గ్రామస్తులు కొన్ని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేశారు.

లబోదిబోమంటున్న రైతులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులే మామూళ్లు తీసుకుని పట్టీపట్టనట్టు వ్యవహరిస్తే స్వర్ణముఖి నదిని కాపాడేదెవరని పలువురు రైతులు వాపోతున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుమారు పదివేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు, 17 గ్రామాల ప్రజలకు తాగునీరు అందించే మంచినీటి పథకాలకు నీటిగండం పొంచి ఉంది. ఇప్పటికే పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, తాళ్వాయిపాడు గ్రామాల వద్ద స్వర్ణముఖినదిలో భారీ తవ్వకాలు చేపట్టడంతో కిలోమీటర్ల మేర గడ్డి పొదలు దర్శనమిస్తున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

స్వర్ణముఖి నదిలో జరుగుతున్న ఇసుక రవాణా, పోర్లుకట్టలు తెగ్గొట్టిన విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ వీరాస్వామి, తహసీల్దార్ గీతా వాణి, సీఐ బాబీ తెలిపారు. పరిశ్రమలకు ఇసుక తరలించడం, ఇతర చోట్ల డంపింగ్ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లేదన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలపై దాడుల నియంత్రణకు కృషి



ఎంపీని కలిసిన అట్రాసిటీ కమిటీ సభ్యులు

చిల్లకూరు : ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు కృషి చేస్తానని తిరుపతి ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆయనను ఆదివారం తిరుపతిలో గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు కూరపాటి రవీంద్రబాబు కలిసి వినతి పత్రం అందజేశారు. కేంద్రం అమలుచేస్తున్న పథకాలు ఎస్సీ, ఎస్టీలకు అందేలా అధికారులతో మాట్లాడాలని కోరారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నియంత్రణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత కంటి వైద్యశిబిరం

కోట: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 180 మందికి తిరుపతి వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్యులు పరీక్షలు చేసి మందులు, అద్దాలు అందజేశారు. నేత్రాల సంరక్షణపై అవగాహన కలిగించారు. ట్రస్ట్ ఏవో క్రిష్ణ, డాక్టర్లు భావన, రచన పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ఈవో నవీన్‌కు మార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ పర్యవేక్షించారు.

రాపూరులో అంకమ్మకు..

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువైన అంకమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగి సేవ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సత్యసాయి భక్తులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం కుమ్మరవీధిలో ఉన్న సత్యసాయి ప్రేమ సుధా మందిరంలో ఆదివారం సత్యసాయి స్పిరుచ్చువల్ అండర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఎంతో గొప్ప భాగ్యమన్నారు. సభ్యులు కావుగంటి వెంకటసుబ్బయ్య, సొల్లేటి తిరుపాలయ్య, ఎస్ఎల్‌వీ సురేష్, బాబు, ఆనంద్ బాబు, మల్లికార్జున్, అరుణకుమార్‌పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్టులో నాయుడుపేట విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

నాయుడుపేట టౌన్ : తిరుపతిలో ఆదివారం జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులో నాయుడుపేట జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రెండో స్థానంలో నిలిచినట్లు ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు తెలిపారు. విద్యార్థులు సాయిరాజ్, ప్రదీప్, జాయిప్రతీష్‌కు డీవైఈవో బాలాజీ ప్రశంసా పత్రాలు అందజేశారని పేర్కొన్నారు.

కండలేరులో 41.703 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 41.703 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9400 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు సరుకులు పంపిణీ



సరుకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని స్ప్లాష్ బట్టల దుకాణం అధినేత పాణకా మల్లికార్జునరెడ్డి తన తండ్రి ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం ఆదివారం పేదలకు నెలకు సరిపడా ఫల సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. అలాగే రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం 25 మంది నిరుపేదలకు గుణ్ణం సేవా ట్రస్టు నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, రాధారెడ్డి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థిని శిరీషకు డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి దాతృత్వంతో రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రగతి సంస్థ అధ్య క్షుడు కడివేటి చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాసులు, మురళీనాయుడు, ఎస్ఐ ప్రభాకర్, దయాకర్, రామక్రిష్ణ, రాము, క్రిష్ణారెడ్డి, చిరంజీవి, విజయ్, నాగేంద్ర, రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సనత్‌కుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, మండీ శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, ఎరమాక కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, పల్లమాల హరినాథ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికుడి కుటుంబానికి దాతల చేయూత



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న ఏకే మణి

నాయుడుపేట టౌన్ : ఆటో ఢీకొని మృతి చెందిన రిక్షా కార్మికుడు నాదేండ్ల సుబ్రమణ్యం అంత్యక్రియలకు దాతలు చేయూత అందించారు. నాయుడుపేటలోని తుమ్మూరులోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన సుబ్రమణ్యం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను శనివారం రాత్రి నడిచి వెళుతుండగా ఆటో ఢీకొనడంతో మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు ఆదివారం మధ్యాహ్నం అప్పగించారు. మృతుని భార్య దివ్యాంగురాలు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో అంత్యక్రియలు చేసేందుకు ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక నాయకులు ఆకుల కుబేరు మణి, పగడాల శివప్రదీప్, శంకు సురేష్, నైనప్పగారి ఏవీ కుమార్, వెంకటేశ్వర్లు ఆర్థిక సాయం అందించారు.

గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..



కూలిన విద్యుత్ స్తంభం వద్ద పనులు చేస్తున్న స్థానికులు, విద్యుత్ శాఖ సిబ్బంది

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం పేర్నాటిమిట్ట వద్ద విద్యుత్ స్తంభం కూలడంతో నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఆదివారం సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. గ్రామస్తుల సహకారంతో కూలిన విద్యుత్ స్తంభం నుంచి వైర్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి గ్రామాలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని తెలిపారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ పోలయ్య మాట్లాడుతూ పడిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో త్వరలో కొత్తవి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ సుబ్బారావు

వెంకటగిరి(సైదాపురం) : అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. పట్టణంలోని టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని 12 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా గుర్తు తెలియని వారు సంచరించినా, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతు న్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఏవీ సుబ్బారావు, గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో సామాన్యుడికి కష్టాలు



సాయిప్రసాద్‌రెడ్డి

కోట : రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. దీంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయన ఆదివారం కోటలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే సామాన్యుడికి కష్టాలు మొదలయ్యాయన్నారు. పేదవాడి కోసం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. వంట నూనెలతో పాటు బియ్యం, పప్పులు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయని వెల్లడించారు. టీడీపీ నాయకులు సహజ వనరులను దోచుకోవడంపైనే దృష్టి పెట్టారని, సామాన్యుడి బాధలు వారికి పట్టడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ధరలను తగ్గించాలని కోరారు.

జనావాసాల్లో మద్యం దుకాణం



కోట క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపు

కోట : మండల కేంద్రమైన కోట క్రాస్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఏర్పాటుచేశారు. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అటు కోట, ఇటు వాకాడు ప్రాంతాలకు కేంద్రంగా ఉన్న కోట క్రాస్ రోడ్డులో నిత్యం జన సంచారం ఉంటుంది. టీడీపీ నాయకులు మద్యం దుకాణాలను గుప్పిట్లో పెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలను ఏర్పాటుచేస్తున్నారు. కోట మండలానికి ప్రభుత్వం ఏడు షాపులకు అనుమతి ఇచ్చింది. వాటిలో రెండు షాపులను కోట క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేశారు. వాటి పక్కనే కూల్ డ్రింక్ షాపులు వెలిశాయి. మందుబాబులు అక్కడే తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై ఉన్న జనంతో పాటు పక్క వ్యాపారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. మద్యం దుకాణాలను ఊరికి దూరంగా తరలించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

బర్డ్స్ వ్యూ పాయింట్‌లో మద్యం సేవనం

అటకానితిప్ప–శ్రీహరికోటకు మధ్యలో పిచ్చి మొక్కలతో నిండిపోయిన బర్డ్స్ వ్యూ పాయింట్



ఉప్పు నీటి సరస్సు అందాలు.. విదేశీ విహంగాల కిలకిలా రావాలు.. పడవల్లో మత్స్యకారుల జీవన పోరాటం.. వెరసి సూళ్లూరుపేట–శ్రీహరికోట మార్గం చూడ ముచ్చటగా ఉంటుంది. పక్షుల భూతల స్వర్గంగా పేరొందిన ఈ ప్రాంతానికి నిత్యం ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడికి కొంతమంది మందుబాబులు కూడా వస్తున్నారు. బర్డ్స్ వ్యూపాయింట్‌లో మద్యం సేవిస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా మద్యం ఖాళీ బాటిల్లే దర్శనమిస్తున్నాయి. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

- పర్యావరణాన్ని పాడు చేస్తున్న మందుబాబులు
- ఎక్కడ చూసినా మద్యం ఖాళీ సీసాలే
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైల్డ్‌లైఫ్ సిబ్బంది

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట–శ్రీహరికోట మార్గంలో రోడ్డుకిరువైపులా విదేశీ విహంగాలను విడిది చేస్తూ ఉంటాయి. వాటిని తిలకించేందుకు వేలాది మంది ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం, శ్రీహరికోట రాకెట్ కేంద్రం వారు కుదిరి–అటకానితిప్ప గ్రామాల మధ్య రెండు బర్డ్స్ వ్యూపాయింట్లు, అటకానితిప్ప–శ్రీహరికోటకు మధ్య మరో రెండు వ్యూ పాయింట్లు ఏర్పాటు చేశారు. వైల్డ్ లైఫ్ వారు సరస్సు అంచున గట్లు ఏర్పాటు చేసి పర్యాటకులు కూర్చునేందుకు చలువరాళ్లతో కూడిన బెంచీలు, పైన రేకుల షెడ్లు నిర్మించారు. పర్యాటకులు అక్కడ కూర్చుని పక్షులను వీక్షిస్తూ వాటిని తమ కెమెరాల్లో బందిస్తూ ఉంటారు. వ్యూపాయింట్లపై వైల్డ్ లైఫ్ సిబ్బంది పర్యవేక్షణ కొరవడడంతో మందుబాబులు బార్లుగా ఉపయోగించుకుంటున్నారు. చలువరాళ్ల బెంచీలను పగులగొట్టారు. ఖాళీ మందు బాటిళ్లను పగులగొట్టి అక్కడ నిలబడడానికి కూడా వీలులేకుండా చేశారు. సరస్సులోకి కూడా ఖాళీ బాటిళ్లు విసిరివేస్తున్నారు. కుదిరి–అటకానితిప్ప మధ్య బర్డ్స్ వాచ్ టవర్‌ను అధ్వానంగా మార్చేశారు. ప్రస్తుతం పర్యాటకులు వ్యూపాయింట్లలోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. అక్టోబర్ రెండో వారానికి పులికాట్ సరస్సుకు కొద్దిగా నీరు చేరడంతో విదేశీ వలస విహంగాల రాక ప్రారంభమైంది. మరో రెండు వానలు కురిస్తే సరస్సుకు పుష్కలంగా నీరు చేరుతుంది. అప్పుడు సుమారు 250 రకాల విదేశీ, స్వదేశీ పక్షులు వచ్చే అవకాశం వుంది. పక్షుల భూతల స్వర్గంగా పేరు గాంచిన పులికాట్ సరస్సును వీక్షించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకుల వస్తుంటారు. ఈలోపు బర్డ్స్ వ్యూ పాయింట్లను శుభ్రం చేసి పర్యాటకులకు అందుబాటులో వుంచాలని స్థానికులు కోరుతున్నారు.



కుదిరి-అటకానితిప్ప మధ్యనున్న బర్డ్స్‌వ్యూ పాయింట్‌లో ధ్వంసమైన బెంచీలు

పేరుకు విధులు, చేసేది సైడ్ బిజినెస్‌లు

సూళ్లూరుపేట కేంద్రంగా నడుస్తున్న వైల్డ్ లైఫ్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్లు సైడ్ బిజినెస్‌లలో లీనమై విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఒక డీఎఫ్‌వో, ఒక రేంజర్ అధికారులు ఉన్నారు. ఈ రెండు పోస్టులకు దూర ప్రాంతాలకు చెందిన వారిని పంపిస్తుడడంతో వారు ఏదో విజిట్‌కు వచ్చినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో కిందిస్థాయి సిబ్బంది కూడా విధులను సక్రమంగా నిర్వహించకుండా పలు రకాల వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో పులికాట్ సరస్సుకు భద్రత కరువైంది. గుల్ల తీసేయడం, వానపాములను తవ్వేయడం వంటివి చేస్తూనే వున్నారు. దీనిపై నిఘా పూర్తిగా కొరవడింది. గుల్ల తవ్వకాలు, వానపాములు తవ్వకాల్లో ఇంటి దొంగల పాత్ర ఎక్కువకావడంతో దీన్ని నిరోధించలేకపోతున్నారు. అధికారులు గతంలోలా దాడులు చేయడం కూడా పూర్తిగా మరిచిపోయారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాల వారికి పులికాట్ సరస్సును, ఇక్కడ కొచ్చే విదేశీ వలస విహంగాలను మ్యాపులో చూపించాల్సిన పరిస్థితి తలెత్తుతుందని స్థానికులు వాపోతున్నారు.